క్లుప్తంగా

రైలులో జనరల్ బోగీల కోసం కోటి ఉత్తరాలు



లక్ష్మీపురం: ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ విన్నవించారు. స్థానిక గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సాధారణ బోగీల సాధన కోసం ప్రధాన మంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాలు రాసే విధంగా ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ అంశాన్ని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా - టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్ ,న్యూఢిల్లీ-110011 చిరునామాకు మన బాధను, డిమాండ్‌ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక వేత్తలు చిలువేరు గణేష్, మూషం అనంత రాములు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

కార్మికురాలి అనుమానాస్పద మృతి

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు గ్రామ సమీపంలోని స్పిన్నింగ్ మిల్లులో శుక్రవారం ఓ కార్మికురాలు అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఉషా కిరణ్ (23) నారాకోడూరు గ్రామ శివారులోని స్పిన్నింగ్ మిల్లులో కార్మికురాలుగా పనిచేస్తోంది. అదే రాష్ట్రానికి చెందిన ఓ యువకుడితో ఆమె సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో మిల్లు కార్వర్స్‌లోని గదిలో ఉరివేసుకొని మృతి చెందింది. ఘటనపై చేబ్రోలు ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు.

ముగిసిన వేసవి శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాలలో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసి, వారికి ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు వేసవి శిక్షణ శిబిరాన్ని వేదికగా మార్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రజాస్వామ్యవాదులకు ఊరట

లక్ష్మీపురం: న్యూస్ క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురస్కాయస్తా అరెస్టు చెల్లదని, తక్షణమే ఆయన్ను విడుదల చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యవాదులకు గొప్ప ఊరట అని అవగాహన సంస్థ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సమకాలీన రాజకీయాలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్‌పై బనాయించిన కేసులకు సంబంధించి దర్యాప్తు సంస్థ ఏ ఒక్క ఆధారం చూపలేకపోయిందన్నారు. న్యాయవాది అవధానుల హరి మాట్లాడారు. కార్యక్రమంలో సింరగయ్య, రవిబాబు, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ భగవన్నారాయణ మృతి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ పి.భగవన్నారాయణ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో డాక్టర్ భగవన్నారాయణ మృతదేహన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. డాక్టర్ భగవన్నారాయణ మృతి పట్ల వైద్యులు, వైద్య సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

గ్రంథాలయం.. విజ్ఞాన నిలయం

గ్రంథాలయం ఒక విజ్ఞాన నిలయం. తెలియని విషయాన్ని తెలుపుతుంది. అగ్రగామిగా నిలపుతుంది. మౌనాన్ని పోగొడుతుంది. అనర్గళంగా మాట్లాడిస్తుంది. అందుకే పుస్తకం.. ఓ మంచి నేస్తం. పుస్తక పఠనం అలవర్చుకుంటే కొత్త విషయాలపై పట్టు సాధించవచ్చు. అందుకే గ్రంథాలయ సంస్థ వేసవి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థులు గ్రంథాలయాల బాటపట్టేలా చేస్తోంది.



ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరానికి హాజరై పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

- 'సమ్మర్ క్యాంప్-2024'
- జూన్ 7 వరకు గ్రంథాలయాల్లో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలు
- 15 ఏళ్లలోపు చిన్నారులకు అవకాశం
- సద్వినియోగించుకోవాలంటున్న గ్రంథాలయ అధికారులు

ప్రత్తిపాడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పది నుంచి పదిహేను సంవత్సరాలలోపు పిల్లలు హాజరు కావచ్చు. ఉదయం 8 గంటల నుంచి పదకొండున్నర గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

శిక్షణ శిబిరంలో ఏమేమి నేర్పిస్తారంటే..

- ఉదయం 8 నుంచి 8.30 వరకు: కథ వినడం (వినే నైపుణ్యాలు)
- 8.30-9.30 వరకు.. ఆటలు వంటి శారీరక కార్యకలాపాలు
- 9.30-9.40 వరకు విరామం
- 9.40-10.00 వరకు పుస్తక సమీక్ష
- 10.00- 10.30 వరకు గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం (చదవడం మాకిష్టం)
- 10.30-11.30 వరకు: స్పోకెన్ ఇంగ్లీష్/ డ్రాయింగ్/ పెయింటింగ్/ పేపర్‌క్రాఫ్ట్స్/ మ్యూజిక్./ డ్యాన్స్/ గెస్ట్ లెక్చరర్లు/ థియేటర్ ట్రెనింగ్ (డ్రామా)/ పప్పెట్ మేకింగ్ వంటివి నేర్పిస్తారు.

హాజరైన వారికి సర్టిఫికెట్లు..

పదిహేనేళ్లలోపు చిన్నారులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సందర్శించి, పుస్తక పఠనంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడతాయి. సృజనాత్మక నైపుణ్యాలు సాధించేలా కృషి చేసేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. శిబిరాలకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తారు. శిబిరాలకు స్వచ్ఛందంగా సహకరించిన వారికి కూడా సర్టిఫికెట్లు అందజేయవచ్చు.

శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి ప్రత్యేక శిబిరాలను ఐదు నుంచి పదిహేనేళ్లలోపు చిన్నారులు వినియోగించుకోవాలి. పుస్తక పఠనంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. విజ్ఞానంతో పాటు సృజనాత్మకతనూ పెంపొందించుకోవచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లలను శిబిరానికి పంపాలి.

– అరుణ లైబ్రేరియన్, ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయం.

అందుబాటులో వందల రకాల పుస్తకాలు

గ్రంథాలయాల్లో పాఠకుని అభిరుచికి తగినట్లుగా వందల రకాల అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి.

- రామాయణం, భారతం, భాగవతం వంటి పురాణ ఇతిహాసాలు..
- డిటెక్టివ్ నవలలు, కథలు
- బాల సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలు.
- జంతు, వృక్ష, రసాయన, భౌతిక, చరిత్ర, మనో విజ్ఞాన శాస్త్రాలు
- పోటీ పరీక్షలకు సంబంధించిన ఏపీ పీఎస్సీ, బీఎస్ఆర్‌బీ, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పుస్తకాలు
- గణిత, గణాంక, సామాజిక, ఆర్థిక శాస్త్ర పుస్తకాలు
- దిన, వార, మాస, పత్రికలు అందుబాటులో ఉంటాయి.



గ్రంథాలయంలోని పుస్తకాలు

సీతారామాంజనేయ స్వామి ఆలయ భూముల కౌలు వేలం

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని కాలేజ్ సెంటరులో ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ భూముల కౌలు వేలం శుక్రవారం నిర్వహించారు. ఆలయ కార్యదర్శి శ్యామల రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో సమీప గ్రామాల్లోని రైతులు పాల్గొన్నారు. వెంగళాయపాలెం, నల్లపాడు గ్రామాల్లో అంకిరెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 636లో ఆలయానికి చెందిన 12-80 ఎకరాల భూమిని గతంలో రూ.68,400కు పలువురు రైతులు వేలంలో కౌలుకు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది కౌలు నిమిత్తం నిర్వహించిన కౌలు పాటకు రైతులు ఒకొక్కరూ రూ.10 వేల వంతున డిపాజిట్ చెల్లించి, పాటలో పాల్గొన్నారు. అధికారులు, రైతుల సమక్షంలో నిర్వహించిన కౌలు పాటలో రైతులు పోటాపోటీగా పాల్గొన్నారు. వెంగళాయపాలెం, నల్లపాడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఆలయానికి చెందిన భూమిని వేలంలో రూ.1,75,000లకు కౌలుకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రైతులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలి



అధికారులతో సమావేశమైన నగర కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

నగర కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీ, సమయంపై పోటీ చేసిన అభ్యర్థులకు నోటీసు ద్వారా సమాచారం అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, పోటీ చేసిన రాజకీయ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు లెక్కింపు తేదీ, సమయం గూర్చిన వివరాలను నోటీసు ద్వారా సమాచారం అందించాలని కోరారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు గుంటూరు తూర్పు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరిగే యూనివర్సిటీలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. సెక్టార్, పోలింగ్ కేంద్రాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేర్వేరుగా మార్గాలు ఉండాలన్నారు. అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సీసీ కెమెరాలు స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, సదరు విజువల్స్‌ని యూనివర్సిటీ ప్రాంగణంలోని కంట్రోల్ రూమ్‌లో చూడవచ్చని అభ్యర్థులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్ చెక్ లిస్ట్ సిద్ధం చేయాలని, కౌంటింగ్ విధులకు అధికారులను, సిబ్బందిని కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ తయారు చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. నగరపాలక సంస్థలోని పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పోలీస్ భద్రత ఉండేలా మేనేజర్ ప్రసాద్, సూపరింటెండెంట్ శివన్నారాయణ సమన్వయం చేసుకోవాలని సూచించారురు. టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్లు, తగిన ఇంటర్ నెట్ సదుపాయం, వీడియోగ్రాఫర్‌లను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, వెంకట లక్ష్మి, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యామ్ సుందర్, ఈఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బీపీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గుంటూరు మెడికల్: వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శుక్రవారం గుంటూరులోని జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బందికి బీపీ పరీక్షలు చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది అందరూ బీపీ పరీక్ష చేయించుకోవాలని కోరారు. బీపీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వాలని చెప్పారు. ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు, ప్రతిరోజూ 30 నిమిషాలు నడక, వ్యాయామం, ధ్యానం, యోగ చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. బీపీ సైలెంట్ కిల్లర్ అని, అప్రమత్తంగా లేకపోతే పక్షవాతం, హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్ కు దారి తీస్తుందని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ బీ.పీ విషయంలో అవగాహన కలిగి ఉండి ఆరోగ్య సూత్రాలు పాటించాలని పేర్కొన్నారు. ఎన్సీడీ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డాక్టర్ గిరిధర్, డాక్టర్. టి.అఖిల్ నిశాంత్ పాల్గొన్నారు.

లాడ్జిల్లో నిబంధనలు పాటించాలి

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా లాడ్జిల నిర్వాహకులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ షేక్ అన్వర్‌బాషా హెచ్చరించారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని లాడ్జిల యజమానులు, మేనేజర్లతో సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. అన్వర్‌బాషా మాట్లాడుతూ లాడ్జి నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రారు మెయిన్‌టెన్ చేయాలన్నారు. అధికంగా వ్యక్తులు వస్తే రూములు ఇవ్వకూడదన్నారు. అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్క లాడ్జి యజమాని కచ్చితంగా కస్టమర్లకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో లాడ్జిల్లో సంఘ విద్రోహక శక్తులు వచ్చే అవకాశం ఉందని, దానిపై లాడ్జిల యజమానులు, మేనేజర్లు పోలీసులకు సహకరించాలని కోరారు.

సుబ్బారావుకు ప్రజా సంఘాల నేతల నివాళి



లక్ష్మీపురం: సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సీనియర్ నేత రాగి సుబ్బారావు సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. గుంటూరు సంగడిగుంట బీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి వేల్పూరి నరసింహారావు అధ్యక్షత వహించారు. రాగి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేల్పూరి నరసింహారావు మాట్లాడుతూ రాగి సుబ్బారావు ఐదు దశాబ్దాలుగా పీడిత ప్రజల ఉద్యమాల్లో కీలకమైన బాధ్యతలు నిర్వహించారన్నారు. పార్టీ నాయకులు పి.ప్రసాద్, ముప్పాళ్ల భార్గవశ్రీ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, డి.రమాదేవి, మన్నవ హరి ప్రసాద్, విరసం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్, ఇతర పార్టీల నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రముఖ సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు, ప్రొఫెసర్ షేక్ అబ్దుల్ నూర్ బాషా, కాలువ శ్రీధర్, భాస్కరరావు, సురేష్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వినయకుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ నజీరుద్దీన్‌కు సన్మానం

గుంటూరు మెడికల్: యువనారీ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ పేదల వైద్యుడిగా మన్ననలు పొందిన సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ పది వేలకు పైగా ఆపరేషన్లు పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం ఆయనకు ఘన సన్మానం చేశారు. స్థానిక గుంటూరువారితోటలోని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా, డాక్టర్ రాహూల్‌రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ విజయప్రకాష్, డాక్టర్ ఆనంద్, హాస్పిటల్ మేనేజర్ పి.వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ పేదలకు సేవ చేసే అవకాశం తనకు దక్కవడం భగవంతుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నానని చెప్పారు. యువనారీ హెల్త్ కేర్ ట్రస్టు, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదేళ్లుగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వివరించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో సర్జరీ వైద్య విభాగంలో సేవలందించే అవకాశం తనకు లభించడం దేవుడు ఇచ్చిన వరం అన్నారు. కేవలం రూ. 10 ఓపీతో హోప్‌విన్ హాస్పిటల్స్‌లో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. వైద్య పరీక్షలు, మందుల్లో కూడా పేదలకు రాయితీ అందిస్తున్నామని వివరించారు.

ఓటింగ్‌కు 34,106 మంది దూరం



ఓటు వినియోగించుకున్న ఓటర్లు(ఫైల్)

పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పొన్నూరు నియోజకవర్గంలో 2,27,135 మంది ఓటర్లకు 1,93,029 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండగ కోసం రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ఈసారి 34,106 మంది వినియోగించుకోకుండా దూరంగా ఉన్నారు. మొత్తం పురుష ఓటర్లు 1,09,008 మంది ఉండగా అందులో 93,464 మంది ఓటు వేశారు. వారిలో 15,544 మంది ఓటు వేయలేదు. మహిళా ఓటర్లు 1,18,116 మంది ఉండగా అందులో 99,552 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వీరిలో 19,572 మంది ఓటు వేసేందుకు ముందుకు రాలేదు. ఇతరులు 11 మంది ఉండగా వీరిలో ముగ్గురు ఓటు వేశారు. పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం తుది లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 84.98 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ ఏర్పాట్లపై అసంతృప్తి..

ఓటు హక్కు వినియోగంపై అధికార యంత్రాంగం అంతంత మాత్రంగానే ప్రచారం చేయడంతో పాటు.. ఎక్కువగా ఓటింగ్ నమోదయ్యే గ్రామీణ ప్రాంతాల్లో బ్యాలెట్‌పై అవగాహన కల్పించలేదనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. పోలింగ్ నెమ్మదిగా సాగడం, కొన్నిచోట్ల ఓటు వేయడానికి సుమారు మూడు గంటలకు పైగా సమయం పట్టడంతో పాటు ఎండ, ఉక్కపోతకు తోడు ఏర్పాట్లు సరిగాలేని కారణంగా కొంతమంది వరుసలో నిల్చోలేక తిరిగి వెళ్లిపోయారని పలువురు చెబుతున్నారు. ఒక్కో బూత్‌లో 800 నుంచి 1200 వరకు ఓటర్లు ఉండటం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లో నిల్చోలేక ఓటు వేసేందుకు దూరంగా ఉన్నారనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం.. డ్రెయిన్లు అధ్వానం

పొన్నూరు: పొన్నూరు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. వార్డులలో రోజుల తరబడి చెత్త, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద కూడా రోజుల తరబడి చెత్త ఉంటోందని ప్రజలు చెబుతున్నారు. ప్రధాన డ్రెయిన్లలో సైతం వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను తొలగించకపోవడంతో మురుగు పారుదలకు అడ్డంకిగా మారింది. ప్రధానంగా 4వ వార్డు పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. డ్రెయిన్లు స్తంభించి మురుగు ప్రవహించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికంగా ఆలయాలు, కల్యాణ మండపాలు ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో ప్రజలు ముక్కు మూసుకుని నడవాల్సిన దుస్థితి నెలకొంది. దుర్వాసన, దోమల బెడదతో జీవనం సాగించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. సైడు కాల్వలతో పాటు రోడ్లపైనే చెత్త రోజుల తరబడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రహదారులు నిర్మించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బంది పడకుండా ఉండే వాళ్లమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై చెత్త ఎక్కడపడితే అక్కడే ఉంటుందని, పట్టణంలో నిల్వ చేరుతున్న చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్తకుప్ప



4వ వార్డులోని డ్రెయిన్‌లో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు, కన్నె పిల్లలతో బిందె తీర్థం, అమ్మవారి మూల విరాట్‌కు నవరస ఫల సహిత పంచామృతంతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహానికి మహా సంప్రోక్షణ, మహిళలు మల్లెపూలతో సామూహిక పూజలు జరిగాయి. రాత్రి అమ్మవారికి నిర్వహించిన పూజా కార్యక్రమాలను చందలూరి శివప్రసాద్, పద్మావతి దంపతులు సమర్పించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.



బిందె తీర్థం తీసుకువస్తున్న మహిళలు, కన్నె పిల్లలు

అంకమ్మతల్లి కొలుపులు ఆరంభం

జంపనివారిపాలెం(భట్టిప్రోలు): మండలంలోని కోనేటిపురం పంచాయతీ జంపనివారిపాలెంలో కొలువై శ్రీ అంకమ్మతల్లి కొలుపుల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచే భక్తులు నైవేద్యాలు, మొక్కు బడులు చెల్లించుకున్నారు. అమ్మవారి కొలుపులు ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారే కాక ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సాయంత్రం అమ్మవారి లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు జంపని వెంకటేశ్వరరావు, జంపని శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

దళిత ఉద్యమ కెరటం కలేకూరి ప్రసాద్

నెహ్రూనగర్: కలేకూరి ప్రసాద్ దళిత ఉద్యమ కెరటమని భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. శుక్రవారం కలేకూరి ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలేకూరి చేసిన రచనలు, పాటలతో దళిత ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. డప్పు ప్రకాష్ మాటకు కలేకూరి ప్రసాద్ పాటతోడై కారంచేడు, చుండూరు తదితర ఉద్యమాలకు బాసటగా నిలిచారన్నారు. కవిగా, సినీ గేయ రచయితగా ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కలేకూరి ఆశయ సాధనకు నేటి తరం ఉద్యమ నాయకులు, దళిత, ప్రజా సంఘాలు పాటుపడాలని కోరారు. మాల ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్‌బాబు మాట్లాడుతూ దళితుల పక్షాల నిరంతరం పోరాటం చేసే వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమని వివరించారు. కార్యక్రమంలో కొరివి రజనీకాంత్, శ్యాంసన్, చరబండరాజు, గోపి, శేషు పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో..

విద్యార్థి దశ నుంచే అగ్రవర్ణ భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధుడు కలేకూరి ప్రసాద్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సమాజంలో దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమ కారుడిగా, కారంచేడు, చుండూరు దళిత పోరాటాలకు ఆకర్షితుడై అనేక రకాల బాధ్యతలను స్వీకరించారన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిన్నం డేవిడ్ విలియమ్స్, రావినూతల కమలకుమారి, బత్తుల అనిల్‌బాబు, డి.రాధాకృష్ణ, బి.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.



కలేకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీమ్ సేన సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు నీలాంబరం